యాదగిరి క్షేత్రం భక్తజన సంద్రం

ఆలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, మే 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఎటుచూసినా భక్తులే కనిపించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం సెలవుతోపాటు స్కూళ్లకు వేసవి సెలవులు ముగుస్తుండటంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. బ్రేక్ దర్శనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులతో తిరుమాడవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, శివాలయం, శ్రీవారి మెట్ల మార్గం రద్దీగా మారాయి. కొండపైన వాహనాల పార్కింగ్ నిండడంతో కొండ కిందే వాహనాలను నిలిపి మెట్ల మార్గం గుండా కొండపైకి చేరుకున్నారు. ఆర్టీసీ బస్సులు సకాలంలో రాకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. సుమారు 62 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. సాయంత్రం స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి సేవపై వేంచేపు చేసి జోడు సేవను తిరువీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయ ముఖ మండపంలో దర్బార్ సేవలో భాగంగా సువర్ణమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపి నక్షత్ర హారతినిచ్చారు. అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. స్వామివారి ఖజానాకు రూ.1,02,68,099 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

కొండ పైన బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న భక్తులు

హామీల అమలులో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం

● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి అర్బన్, మే 26 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. జూన్ 15, 16 తేదీల్లో భువనగిరి పట్టణంలో నిర్వహించే సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల జయప్రదానికి ఆదివారం ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ప్రజా ప్రయోజనకర పథకాలను ప్రజలకు నేరుగా చేరేలా చూడాలన్నారు. ఎన్నికల పేరుతో ఇప్పటి వరకు కాలయాపన చేశారని, ఇప్పటికైనా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. పార్టీ నాయకులు, సభ్యులకు రాజకీయ చైతన్యం కలిగించి ప్రజా పోరాటాలు నిర్వహించేందుకు ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడుతాయన్నారు.

అనంతరం శిక్షణ తరగతుల ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, నాయకులు దయ్యాల నరసింహ, గడ్డం వెంకటేశ్, రాజు, భాగ్య, లలిత, రాణి, అంజయ్య, నరసింహ, గంగయ్య పాల్గొన్నారు.

ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి : సీపీఎం

పల్లివాడ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, మే 26 : ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పల్లివాడ గ్రామంలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలోని ధాన్యం రాశులను ఆదివారం పరిశీలించి మాట్లాడారు. ధాన్యం పోసి రెండు నెలలు అవుతున్నా 40శాతం కూడా కొనుగోలు చేయలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు 200 గ్రాములు అధికంగా జోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గన్నెబోయిన విజయ భాస్కర్, బోయిని ఆనంద్, నాయకులు నగేశ్, సైదమ్మ, మత్స్యగిరి, లక్ష్మణ్, నర్సింహ, రమేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

● జిల్లాలో 34,080 మంది ఓటర్లు.. 37 పోలింగ్ కేంద్రాలు

పోలింగ్ సామగ్రితో బస్సులో కేంద్రాలకు సిబ్బంది

భువనగిరి కలెక్టరేట్, మే 26 : నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించారు. జిల్లాలో 34,080 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా.. వారి కోసం 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. భువనగిరి డివిజన్‌లో 20,205 మంది ఓటర్లు (పురుషులు 12,421, మహిళా ఓటర్లు 7,784) ఉండగా, చౌటుప్పల్ డివిజన్‌లో 13,875 మంది (పురుషులు 8,417, మహిళలు 5,458) ఓటర్లు ఉన్నారు. వారందరికీ క్షేత్రస్థాయి సిబ్బంది పోలింగ్ స్లిప్పులు అందజేశారు. సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 52 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో 12మంది సెక్టార్ అధికారులు, ఆరుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 17 వీడియో, 17 ఎంసీసీ బృందాలు ఉన్నాయి. ఎన్నికల పర్యవేక్షణను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ బృందాలు పూర్తి స్థాయిలో పనిచేయనున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఎవరూ ఉండకుండా చర్యలు తీసుకోవడంతోపాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

చౌటుప్పల్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ

చౌటుప్పల్‌లో పోలింగ్ సామగ్రి తీసుకుంటున్న అధికారులు

చౌటుప్పల్, మే 26 : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం సాన్‌జాన్ స్కూల్‌లో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. సోమవారం ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. చౌటుప్పల్ డివిజన్ పరిధిలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మండలాల్లో 13,875 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇందులో పురుషులు 8,417, మహిళా ఓటర్లు 5,458 మంది ఉన్నారు. డివిజన్ వ్యాప్తంగా 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ సమయంలో మలి విడుత శిక్షణ నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి (ఏపీఓ), అదర్ పోలింగ్ ఆఫీసర్స్ (ఓపీఓలు) ఇద్దరు చొప్పున విధులు నిర్వర్తించనున్నారు. వారితోపాటు మరికొంత మంది సహాయ సిబ్బంది పని చేయనున్నారు.

పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

ఆత్మకూరు(ఎం) : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

ఆత్మకూరు(ఎం), మే 26 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఆదివారం ఎన్నికల సిబ్బంది, పోలీసులు చేరుకున్నారు. మండలంలో మొత్తం 1,563 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు పూర్తయినట్లు తాసీల్దార్ రవి కుమార్ తెలిపారు.

మోటకొండూరు : మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రితోపాటు సిబ్బంది ప్రత్యేక వాహనంలో చేరుకున్నారు. మండలంలో పురుషులు 690, మహిళలు 364 మొత్తం 1054 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తాసీల్దార్ శాంతీలాల్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పట్టభద్రులు సహకరించాలని అధికారులు కోరారు.

మోత్కూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తాసీల్దార్ రాంప్రసాద్ తెలిపారు. మండలంలో 1,496 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో రాగా, వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

అడ్డగూడూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తాసీల్దార్ శేషగిరిరావు తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. మండలంలో 992 మంది ఓటర్లు ఉన్నట్లు, మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

3,561 మంది పట్టభద్రులు

వలిగొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు సహాయ ఎన్నికల అధికారి పి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర పాఠశాలలో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 15 మంది సిబ్బంది ఎన్నికల సామగ్రితో ఆదివారం మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా 3,561 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : తాసీల్దార్

భూదాన్ పోచంపల్లి : ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తాసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండలంలో 1,966 మంది ఓటర్లు ఉన్నారని, వారి కోసం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని అన్నారు. ఓటర్లు ఏదైనా గుర్తింపు కార్డుతోపాటు పోలింగ్ చీటీ తీసుకురావాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలోకి పెన్ను, సెల్‌ఫోన్ తీసుకు రావద్దన్నారు.

మోటకొండూరు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన సిబ్బంది, సామగ్రి

వలిగొండ : శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో వచ్చిన సిబ్బంది

భూదాన్ పోచంపల్లిలో పోలింగ్‌కు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మోత్కూరు : ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వచ్చిన సిబ్బంది

బెల్లి లలిత త్యాగం గొప్పది

● మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, మే 26 : తెలంగాణ ఉద్యమంలో గాయకురాలు బెల్లి లలిత కీలకంగా పనిచేశారని, ఆమె త్యాగం గొప్పదని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. లలిత 25వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఊరూరా తిరిగి తన పాటల ద్వారా ప్రజలను ఎంతో చైతన్యం చేశారన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, మురళీకృష్ణ, అవిలి మల్లు, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

తుర్కపల్లి : తన గానంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తిని నింపిన గాయని బెల్లి లలిత వర్ధంతిని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంతోష్‌నాయక్ తుర్కపల్లి చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పడాల శ్రీనివాస్, బాలూయాదవ్, ఐలేశ్, రాజు, నర్సింహ, కనకరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మోత్కూరులో బెల్లి లలిత చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

భువనగిరి అర్బన్ : పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బెల్లి లలిత చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెల్లి లలిత కుమారుడు సూర్యప్రకాశ్ మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన లలిత జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ బీరు మల్లయ్య, నాయకులు ప్రమోద్‌కుమార్, జహంగీర్, రవికుమార్, రామచంద్రయ్య, జాగృత్, కృష్ణ, సతీశ్, మల్లారెడ్డి, హమీద్, శ్రీను, వీరేశ్, రమేశ్, ఆనంద్, వెంకటేశ్, యాదయ్య, పాండు, దశరథ, బాలు, దయాకర్, శివుడు పాల్గొన్నారు.

పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగే

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే, జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 26 : పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు. వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నిక పురస్కరించుకొని ఆదివారం రాయగిరి విద్యాజ్యోతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ మెటీరియల్ స్వీకరిస్తున్న పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. అధికారులు కేటాయించిన పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు చేరుకొని ఓటింగ్‌కు అన్నీ సిద్ధం చేసుకోవాలన్నారు. సోమవారం ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ జరుగుతుందని తెలిపారు. భువనగిరి డివిజన్‌లో 22, చౌటుప్పల్ డివిజన్‌లో 15.. మొత్తం 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భువనగిరి డివిజన్‌లో 7,784 మంది మహిళలు, 12,421 మంది పురుషులు, చౌటుప్పల్ డివిజన్‌లో 5,458 మంది మహిళలు, 8,417 మంది పురుషులు కలిసి మొత్తం 34,080 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు.

డేగల లక్ష్మమ్మకు జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే నివాళి

లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

వలిగొండ, మే 26 : బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు డేగల పాండరి మాతృమూర్తి డేగల లక్ష్మమ్మ ప్రథమ వర్ధంతిని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి హాజరై లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, పనుమటి మమత నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ పల్సం రమేశ్ పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డిని పెద్దల సభకు పంపించాలి

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హరిశంకర్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హరిశంకర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), మే 26 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి పట్టభద్రులంతా ఓటు వేసి పెద్దల సభకు పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మట్లాడారు. నిరుద్యోగ యువత, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రజా గొంతుకైన విద్యావంతుడు రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లెల పర్వతాలు, మండల మాజీ అధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎలగందుల విజయ్‌కుమార్, నాయకులు సత్యనారాయణ, బీరప్ప, ఉపేందర్‌రెడ్డి, ఐలయ్య, మహేందర్‌రెడ్డి, యాదమల్లు, వెంకన్న పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదు, బ్యాగులు అందజేస్తున్న ప్రదీప్ కుమార్ గౌడ్

బీబీనగర్, మే 26 : మండలంలోని పడమటి సోమారం గ్రామంలో ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు దాసన్న ఫౌండేషన్ చైర్మన్ టి.ప్రదీప్‌కుమార్ గౌడ్ ఆదివారం నగదు ప్రోత్సాహకంతోపాటు బ్యాగులు అందజేశారు. మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.5వేలు, మరో 20 మందికి రూ.2వేల చొప్పున అందించారు. అనంతరం సంగం బ్లడ్ బ్యాంక్ సహకారంతో 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రతి సంవత్సరం చేస్తామని, తల్లిదండ్రులు లేని పిల్లల విద్యకు అయ్యే ఖర్చును ఫౌండేషన్ ద్వారా అందజేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఆల్వ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య, మాజీ సర్పంచ్ గణేశ్ యాదవ్, ఆర్‌కే రెడ్డి, మోహన్‌రెడ్డి, బస్వయ్యగౌడ్, భాస్కర్ గౌడ్, బాల్‌చందర్, రాంకొండల్, శ్రీనివాస్, రాములు, వీరారెడ్డి, అంజయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

జైనపల్లి చిన్నారులకు రామకృష్ణ మఠం ప్రతినిధుల అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణ మఠం ప్రతినిధులు

బీబీనగర్, మే 26 : మండలంలోని జైనపల్లి గ్రామంలో ఇటీవల నిర్వహించిన హనుమాన్ కాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా చిన్నారులు ప్రజల నుంచి సేకరించిన నగదును హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం ప్రతినిధులకు ఆదివారం అందజేశారు. ఆ చిన్నారులు శ్రీహిత, జీవిక, కీర్తి, శ్రీనిక, మానిశ్‌రెడ్డి, అక్షిత్‌రెడ్డి, శ్రీహాన్‌రెడ్డిని మఠం ప్రతినిధులు అభినందించారు. ఆ నగదును నిరుపేదల సంక్షేమానికి వినియోగిస్తామని వారు తెలిపారు.